సాక్షి కర్నూలు
గురువారం 10 ఏప్రిల్ 2025



అలరించిన భజన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా బుధవారం ఆలయ నిత్యకళావేదికపై నంద్యాలకు చెందిన లక్ష్మీచెన్నకేశవస్వామి భజన మండలి వారి భజన కార్యక్రమం భక్తులను అలరించింది.



నిధులు నిర్లక్ష్యం పాలు

ప్యాపిలిలో విలేజ్ హెల్త్ క్లినిక్ వృథాగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.20.80 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 8లో▸



పిడుగుల కాలం..

ఇటీవల ఒక్క రోజులోనే జిల్లాలోని మూడు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. రానున్న రోజుల్లో పిడుగులు పడే ప్రమాదం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. 8లో▸

హంద్రీ.. చెదిరినది

- నది సరిహద్దులో అక్రమ కట్టడాలు
- సర్వేలో తేలిన వాస్తవాలు
- నివేదిక ఇచ్చినా స్పందించని నగరపాలక సంస్థ అధికారులు
- నది సరిహద్దుల దగ్గర పిల్లర్ల ఏర్పాటు
- నదికి కుడి వైపు 164, ఎడమ వైపు 174 మంది అక్రమార్కుల గుర్తింపు

కర్నూలు సిటీ: స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో కళకళలాడుతూ ఉండే హంద్రీనది నేడు ఆక్రమణలతో రూపును కోల్పోయింది. నదీ తీరంలో వృక్షాలు సైతం కనిపించక పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. కర్నూలు నగరం విస్తీర్ణం ఏడాదికేడాది పెరుగుతుండటం.. భూములకు భారీ డిమాండ్ ఉండడంతో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వివిధ రాజకీయ పార్టీల అండతో నిబంధనలకు విరుద్ధంగా నదీ తీరంలోని భూముల్లో అడ్డగోలుగా భవనాలు నిర్మించారు. బఫర్‌జోన్‌లో నివాసాలు నిర్మిస్తున్నా... నగరపాలక సంస్థ అధికారులు కాసులకు కక్కుర్తి పడి అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలతో నది స్వరూపమే మారిపోతోంది. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. నది ఆక్రమణలపై ఫిర్యాదులు పెరుగుతుండడంతో జల వనరుల శాఖ వరద రక్షణ విభాగం చర్యలు చేపడుతోంది. నదికి ఇరువైపులా బఫర్‌జోన్‌లో నిర్మించిన అక్రమ కట్టడాలపై రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే చేసి ఓ నివేదికను కర్నూలు నగరపాలక సంస్థకు అందజేశారు. అయితే వారు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. నది సరిహద్దులను గుర్తించి పిల్లర్లను ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచారు. జల వనరుల శాఖ వరద రక్షణ విభాగం ఆధ్వర్యంలో 10 అడుగల పిల్లర్లను ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే కర్నూలులోని వక్కెరవాగుకి ఇరువైపులా ఉన్న భూములను సైతం సర్వే చేసేందుకు సమాచాలోచనలు చేస్తున్నారు.



పందిపాడు సమీపంలో హంద్రీనది సరిహద్దులో ఏర్పాటు చేసిన పిల్లర్



నది సరిహద్దులో ఏర్పాటు చేసేందుకు లారీలో పిల్లర్లు తీసుకొచ్చిన దృశ్యం

హంద్రీ ప్రవాహం ఇలా..

పత్తికొండ సమీపంలోని మద్దికెర, మొలగవల్లి ప్రాంతాల దగ్గర నుంచి కర్నూలు నగరంలోని రైల్వే వంతెన వరకు సుమారుగా 120 కి.మీ దూరం హంద్రీ నది ప్రవహిస్తుంది. పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలు, పాణ్యం నియోజకవర్గాల్లో ప్రవహిస్తూ...కర్నూలు నియోజకవర్గంలో వక్కెర వాగుతో కలిసి తుంగభద్ర నదిలో కలుస్తుంది. కర్నూలు నగరంలో 7.40 కి.మీ ప్రవహిస్తుంది.

పిల్లర్లు ఏర్పాటు చేస్తున్నాం

హంద్రీ నది ఆక్రమణలపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. రెవెన్యూ అధికారులు, సచివాలయాల సర్వేయర్లు కలసి పందిపాడు నుంచి కేసీ కెనాల్ వంతెన వరకు హంద్రీ నది సరిహద్దులపై సర్వే చేశారు. నదికి ఇరువైపులా 338 చోట్ల ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. నది సరిహద్దులను గుర్తించి రూ. 7.20 లక్షలతో 10 అడుగుల పిల్లర్లను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 65 పిల్లర్ల వరకు ఏర్పాటు చేశాం. వాటికి రంగులు వేసి హంద్రీనది అని రాయనున్నాం. నగరపాలక సంస్థ అధికారులు నిధులు ఇస్తే మిగిలిన చోట్ల సైతం ఏర్పాటు చేస్తాం.

– రామకృష్ణ, డీఈఈ, జలవనరుల వరద రక్షణ విభాగం

ఆక్రమణలు ఇలా..

- హంద్రీ నదిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వుతున్నారు. నదీ తీర ప్రాంతాలు ఆక్రమణకు గురయ్యాయి.
- హంద్రీ నదికి 1997, 2007, 2009, 2018 సంవత్సరాల్లో భారీ వరద నీరు రావడంతో తీర కాలనీల వాసులు తీవ్రంగా నష్టపోయారు. వరద రక్షణ నుంచి కాపాడేందుకు రక్షణ గోడ పనులు పునాదులకే పరిమితమయ్యాయి.
- నదికి 50 మీటర్లు, 150 అడుగులు ఉన్న తీర భూమి బఫర్‌జోన్‌లో ఉంటుంది. అత్యధిక శాతం ఈ జోన్‌లోనే కట్టడాలు ఉన్నాయి. ఇందులో నదికి కుడి వైపు 164, ఎడమ వైపు 174 అక్రమ కట్టడాలను గుర్తించారు.
- అక్రమ కట్టడాలపై చర్యలకు కర్నూలు నగరపాలక సంస్థ అధికారులకు సిఫారసు చేశారు. వారు మొదట్లో హడావిడి చేసి ఆ తరువాత మిన్నకుండి పోయారు.

సర్వేలో గుర్తించినవి ఇవీ..

- హంద్రీ నదికి ఇరువైపులా ఉన్న భూములు, బఫర్ జోన్లలోని అక్రమ కట్టడాలను సర్వేలో గుర్తించారు.
- కుడివైపున సర్వే నంబరు 424/ఎ లో బీకే సింగ్ రెండు ప్లాట్లు, సర్వే నంబరు 470/బీలో 13 ప్లాట్లు(ఒక్కోటి 2.75 సెంట్లు), ఇదే నంబరులో మరో 135 అక్రమణలు ఉన్నాయి.
- 498/ఎ లోని రావూరి గార్డెన్ ఫోల్ స్ట్రక్చర్‌ను కొంత నది భూమిలో నిర్మించారు. ఇందులోనే మరో 7 నిర్మాణాలు సైతం బఫర్ జోన్‌లోనే ఉన్నాయి.
- సర్వే నంబరు 533లో 8 నిర్మాణాలు, సర్వే నంబరు 24లో వావిలాల కృష్ణమూర్తి 139.4 చ.మీ. భూమిలో నిర్మాణాలు చేపట్టారు.
- నదికి ఎడమ వైపున సర్వే నంబరు 770/ఎఫ్‌లో భవనాల అంచులు నది భూమిలో చేపట్టారు.
- 424/ఎ లో నాలుగు కట్టడాలు, సర్వే నంబరు 470/బిలో 33 కట్టడాలు, సర్వే నంబరు 498/ఎ లో 24 కట్టడాలు, సర్వే నంబరు 533లో 110 కట్టడాలు, సర్వే నంబరు 24లో ప్రభుత్వ హోల్‌సేల్ ఐఎంఎఫ్ఎల్ అండ్ ఎఫ్ఎల్ డిపో కాంపౌండ్ వాల్ 943.52 చ.మీ. హంద్రీనదిలో నిర్మించారు. ఇదే సర్వే నంబరులో ఫెన్సింగ్ వేసినట్లు సర్వేలో గుర్తించారు.

జెడ్పీ సీఈఓలుగా ఐఏఎస్‌లు

- ఇక డిప్యూటీ ఎంపీడీఓలుగా ఈఓఆర్‌డీలు

కర్నూలు(అర్బన్): జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారులుగా ఐఏఎస్ అధికారులను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశి భూషణ్‌కుమార్ జీఓ 35 జారీ చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో చేపడుతున్న పలు సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా పరిషత్‌లలో 50 శాతం సీఈఓ పోస్టుల్లో ఐఏఎస్‌లను నియమించాలని, మిగిలిన 50 శాతం పోస్టులను డీడీఓ, డిప్యూటీ సీఈఓ(జిల్లా పరిషత్), పీఆర్‌అండ్‌ఆర్‌డీలోని డిప్యూటీ డైరెక్టర్, డీపీఓలకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే డీడీఓ, డీపీఓ, డిప్యూటీ సీఈఓ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌తో పాటు ఎంపీడీఓ/ఏపీ సెక్రెటేరియట్‌లోని సెక్షన్ ఆఫీసర్లకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. అలాగే ప్రస్తుతం ఈఓఆర్‌డీలుగా ఉన్న వారిని ఇక నుంచి డిప్యూటీ ఎంపీడీఓలుగా మార్చారు. ప్రభుత్వం జారీ చేసిన ఈ జీఓ మేరకు డిప్యూటీ ఎంపీడీఓలతో పాటు డీఎల్‌పీఓ, ఏఓ, సెక్రెటేరియట్‌లోని సెక్షన్ ఆఫీసర్లు, సీనియర్ స్టెనోలకు ఎంపిడీఓలుగా పదోన్నతులు కల్పించేందుకు అవకాశం ఏర్పడింది.

ఆందోళనలో మిర్చి రైతు

- క్వింటా ధర రూ.10వేల లోపే..

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి ధర మరింత పతనమైంది. మిర్చిలో తేజ, ఎరుపు, బ్యాడిగ, ఆర్మూర్, డీలక్స్, సూపర్-10 తదితర రకాలు ప్రధానమైనవి. వీటిల్లో ఏ ఒక్క రకం ధర కూడా రూ.10 వేలు దాటని పరిస్థితి. మార్కెట్‌లో వ్యాపారులు రైతులను రాబట్టుకునేందుకు కేవలం ఒకటి, రెండు చిన్న లాట్లకే కొంత ఎక్కువ ధర కోట్ చేస్తున్నారు. మిగిలిన వాటికి తక్కువ ధరలు వేయడం సర్వసాధారణమైంది. మిర్చి ఎరుపు రకానికి రూ.10 వేలు వరకు ధర లభించడం గమనార్హం. బ్యాడిగ రకాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఈ రకానికి ధర నేలను తాకింది. క్వింటాకు కేవలం రూ.4,800 వరకు ధర లభిస్తుండటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. తేజ రకానికి కనిష్ఠంగా రూ.499, గరిష్ఠంగా రూ.8,639, సగటు ధర రూ.4,099 పలికింది. సూపర్-10 రకానికి కనిష్ఠంగా రూ.2,559, గరిష్ఠంగా రూ.7,309, సగటు ధర రూ.4,110 ధర లభించింది.

న్యూస్‌రీల్

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పరిశీలన



క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి. శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ పరిశీలించారు. పీసీ పీఎన్‌డీటీ కొత్త రిజిస్ట్రేషన్‌లో భాగంగా స్కానింగ్ గదిని తనిఖీ చేసి మిషన్‌కు సంబంధించిన పత్రాలు, వైద్యుల సర్టిఫికెట్లను పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్న ప్రివెంటివ్ ఆంకాలజి విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి వారం ఐదు రోజులు నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లను స్క్రీనింగ్ చేస్తారన్నారు. అనుమానిత కేసులను పీహెచ్‌సీ, యుపీహెచ్‌సీలకు పంపిస్తారని, అనంతరం స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు రెఫర్ చేస్తారని తెలిపారు. ఆమె వెంట స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ సీఎస్‌కే. ప్రకాష్, రేడియాలజిస్టు డాక్టర్ దిలీప్‌కుమార్ ఉన్నారు.

'ఉపాధి'లో 90 శాతం లక్ష్యాన్ని సాధించాలి

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ముమ్మరంగా ఉపాధి హామీ పనులను కల్పించి 90 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి వివిధ అంశాలపై డివిజన్, మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో కూలీలకు రూ.286 సగటు కూలీ ఇచ్చినట్లు చెప్పారు. జూన్‌లోపు లక్ష్యం మేరకు ఫాంపాండ్స్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. తాగునీటి సమస్యకు సంబంధించి జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేసి సత్వరం పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, డ్వామా పీడీ వెంకట రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

మెగా డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

కర్నూలు(అర్బన్): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి కె.ప్రసూన తెలిపారు. ఏపీ టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈబీసీ, ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తమ కార్యాలయంలో ఖాళీ దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తులను అందించేందుకు చివరి తేదీ, ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభ తేదీ, కోచింగ్ కాల వ్యవధి తదితర వివరాలను అభ్యర్థులకు తగిన సమయంలో తెలియజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు బిర్లాగేట్ సమీపంలోని సంక్షేమభవన్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సుంకేసులకు 1,850 క్యూసెక్కుల నీరు

కర్నూలు సిటీ: తుంగభద్ర డ్యాం నుంచి రోజుకు 5 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా సుంకేసుల బ్యారేజీలోకి 1,850 క్యుసెక్కులు వస్తోంది. తుంగభద్ర డ్యాం నుంచి నాలుగు రోజుల పాటు నీటిని విడుదల చేస్తుండగా బుధవారం సుంకేసులకు వచ్చి చేరాయి. మరో రెండు రోజుల పాటు నదిలో నీటి ప్రవాహం ఉండనుంది. ప్రస్తుతం సుంకేసుల బ్యారేజీలో 0.954 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఇందులో కొంత నీటిని కర్నూలు నగరవాసుల దాహార్తి తీర్చేందుకు విడుదల చేస్తున్నారు.

ముగిసిన 'పది' మూల్యాంకనం

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షల మూల్యాంకనం బుధవారం ముగిసింది. ఈనెల 3వ తేదీన మొదలైన మూల్యాంకనానికి వివిధ జిల్లాల నుంచి మొత్తం 1,92,725 సమాధాన పత్రాలు జిల్లా వచ్చాయి. మొదటి రోజున స్పాట్ విధులు నిర్వహించేందుకు ఉత్తర్వులు ఇచ్చినా కూడా ఉపాధ్యాయులు వివిధ కారణాలతో హాజరుకాలేదు. ఉపాధ్యాయుల సంఘాలతో అనుబంధం ఉన్న ఉపాధ్యాయులు పలు కారణాల చూపి స్పాట్ డ్యూటీ నుంచి మినహాయింపు తీసుకున్నారు. దీంతో కస్తూర్బా పాఠశాలల్లోని టీచర్లకు సైతం స్పాట్‌లో స్పెషల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహించేందుకు ఉత్తర్వులు ఇచ్చారు. రెగ్యులర్ పరీక్షలతో పాటు ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్ష మూల్యాంకనం సైతం ఆరు రోజుల పాటు నిర్వహించారు. ఇందుకు 16,220 సమాధాన పత్రాలు జిల్లాకు వచ్చాయి. స్పాట్ క్యాంప్ ఆఫీసర్‌గా డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్‌గా ఓంకార్ యాదవ్ వ్యవహరించారు.

18 మంది ఎస్‌ఐలకు స్థానచలనం



కర్నూలు: జిల్లా పోలీసు శాఖలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 18 మంది ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. స్థానచలనం కలిగిన వారిలో ఒక మహిళా ఎస్‌ఐ, ముగ్గురు ఆర్‌పీఎస్‌ఐలు, 14 మంది ఎస్‌ఐలు ఉన్నారు. ఇందులో ఐదుగురు వీఆర్‌లో ఉన్నవారికి పోస్టింగులు దక్కగా, స్టేషన్లలో ఉన్న ఐదుగురు వీఆర్‌కు బదిలీ అయ్యారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.పరమేష్ నాయక్	వీఆర్, కర్నూలు	సి.బెళగల్ పీఎస్
ఎం.తిమ్మారెడ్డి	సి.బెళగల్ పీఎస్	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్
సి.శరత్ కుమార్ రెడ్డి	ముచ్చుమర్రి (నంద్యాల జిల్లా	నాగలాపురం పీఎస్
వి.టి.ఆశాలత	నాగలాపురం పీఎస్	కర్నూలు త్రీటౌన్
ఎస్.తిమ్మయ్య	గూడూరు పీఎస్	ఇస్వీ పీఎస్
ఎస్.నాగేంద్ర	ఇస్వీ పీఎస్	మహిళా పీఎస్, కర్నూలు
పి.నిరంజన్ రెడ్డి	పెద్దకడుబూరు పీఎస్	గూడూరు పీఎస్
పి.మధుసూదన్‌రెడ్డి	సైబర్ సెల్, కర్నూలు	ఎమ్మిగనూరు టౌన్ పీఎస్
బి.ఆర్.నాయక్	ఎమ్మిగనూరు యూపీఎస్	పెద్దకడుబూరు పీఎస్
డి.ఎర్రిస్వామి	వీఆర్, కర్నూలు	కోడుమూరు పీఎస్
ఎ.పి.శ్రీనివాసులు	కోడుమూరు పీఎస్	కర్నూలు టూటౌన్ యూపీఎస్
డి.కిరణ్‌బాబు	వీఆర్, కర్నూలు	మహిళా పీఎస్, కర్నూలు
బి.మల్లికార్జున	వీఆర్, కర్నూలు	కర్నూలు టూటౌన్ పీఎస్
ఎస్.పి.మహబూబ్ బాషా	వీఆర్, కర్నూలు	పీసీఆర్, కర్నూలు
బి.వి.రమణ రావు	మహిళా పీఎస్, కర్నూలు	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్
పి.నిర్మలా దేవి	మహిళా పీఎస్, కర్నూలు	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్
పి.మోహన్ కిషోర్ రెడ్డి	కర్నూలు టూటౌన్	కర్నూలు ఫోర్త్‌టౌన్
షమీర్ బాషా	కర్నూలు ఫోర్త్ టౌన్	ఆదోని వన్‌టౌన్

అర్ధరాత్రి ఆదోని ఎమ్మెల్యే అనుచరుల దౌర్జన్యం

- టిప్పర్‌కు రూ.40 వేలు, ట్రాక్టర్‌కు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్



ఎమ్మెల్యే అనుచరులు నిలిపేసిన టిప్పర్

ఆదోని అర్బన్: పట్టణంలో బీజేపీ కార్యకర్తల ఆగడాలు మితిమీరిపోయాయి. అర్ధరాత్రి పూట ఎమ్మెల్యే పీఏ అని, అనుచరులమని దాదాపు 10 మంది ఇసుక టిప్పర్, ట్రాక్టర్‌లను ఆపి దౌర్జన్య చేస్తున్నారు. లోడింగ్ రశీదులను చింపేసి ఎమ్మెల్యేను కలవాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ట్రాక్టర్ ఓనర్ కృష్ణ, టిప్పర్ డ్రైవర్ మహమ్మద్‌హుసేన్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.30 గంటల సమయంలో డస్ట్ తీసుకెళ్తున్న లారీని ఆపి దౌర్జన్యానికి పాల్పడిన విషయం తెలిసిందే. అదే రోజు రాత్రి 11 గంటలకు ఎమ్మెల్యే అనుచరులు సాయి, తాయన్న, రమాకాంత్, విజయ్‌లతోపాటు మరో ఆరుగురు టిప్పర్‌లను, ట్రాక్టర్‌లను ఆపి నెలకు ట్రాక్టర్‌కు రూ.15 వేలు, టిప్పర్‌కు రూ.40 వేలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేయడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఇదిలాఉంటే అక్రమ రవాణా, ఇసుక మాఫియాను నియంత్రించేందుకే బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తున్నారని బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజుగౌడ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి విజయ్‌కృష్ణ జరిగిన ఘటనలను సమర్థించుకోవడం గమనార్హం. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారిపై వచ్చిన ఆరోపణలను ఖండించారు.

బాధిత రైతులకు న్యాయం చేయాలి

- పిన్నాపురం, తమ్మరాజుపల్లెలో భూ సమస్యలు పరిష్కరించాలి
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న కాటసాని

పాణ్యం: గత కొంత కాలంగా నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించి బాధిత రైతులకు న్యాయం చేయాలని అధికారులకు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. పాణ్యంలోని పార్టీ కార్యాలయం వద్ద పిన్నాపురం, తమ్మరాజుపల్లె గ్రామాల రైతులతో బుధవారం చర్చించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. సోలార్ పరిశ్రమ వచ్చిన తర్వాత కొత్త ముఖాలు ఆన్‌లోన్‌కి వచ్చాయని, ఈ విషయంపై అధికారులు క్షేత్ర స్థాయిలో రికార్డులను పరిశీలించాలన్నారు. ఇప్పటికే భూ సమస్యలపై అనేక సార్లు రెవెన్యూ అధికారులను కలిసి వినతి పత్రాలు ఇచ్చామన్నారు. ఇటీవల చాలా మంది పేర్లను రైతులుగా ఆన్‌లైన్‌లో చేర్చారని, క్షుణ్ణంగా విచారణ జరిపి నిజమైన అన్నదాతలను అధికారులు గుర్తించాలన్నారు.

కోర్టుకు వెళితే బెదిరింపులా?

పిన్నాపురంలో భూ సమస్యలపై రైతులు కోర్టుకు వెళితే వారిని అధికారులు, పోలీసులు బెదిరించడం ఏమిటని కాటసాని మండిపడ్డారు. కోర్టులో సమస్యలు పరిష్కారమవుతాయని, అంత వరకు అధికారులు సమన్వయం పాటించకుండా రైతులను బెదిరించే ధోరణితో మాట్లాడడం సరికాదన్నారు. కోర్టు తీర్పు ఆధారంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల ఉత్సాహం ఎవరికి లాభం చేకూర్చడానికి అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని త్వరలోనే బాధిత రైతులతో కలసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సాగునీటిపై ఆరా

ఎస్సార్బీసీ ఆయకట్టులో సాగు చేస్తున్న పంటలకు నీరు ఎలా అందుతుందనే విషయంపై రైతులతో కాటసాని మాట్లాడారు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందుతుందా లేదా అనే విషయంపై అడిగి తెలుసుకున్నారు. సాగునీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సార్బీసీ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి కాల్వల సమస్యలను గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. మిరప, వరి తదితర పంటలకు మార్కెట్‌లో వస్తున్న ధర గురించి అడిగి తెలుసుకున్నారు. మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, ఆటోమాబు, చందమామ బాబు, తొడేటి సుబ్బయ్య, జయచంద్రారెడ్డి, క్రిష్టారెడ్డి , మధురెడ్డి, చిన్న సుబ్బయ్య, బాలస్వామిరెడ్డి , పెద్ద ఎల్లసుబ్బయ్య, బాలిరెడ్డి, టైలర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

12న వీర హనుమాన్ విజయ శోభాయాత్ర



వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈనెల 12న వీర హనుమాన్ విజయ శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి తెలిపారు. బుధవారం వినాయక్ ఘాట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలోపాసన దివస్‌ను పురస్కరించుకొని హిందు బంధువులను సంఘటితం చేయడానికి వీర హనుమాన్ శోభాయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. 12వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు ఓల్డ్ సిటీలోని లలితా పీఠం వద్ద శోభాయాత్ర ప్రారంభమై స్వామి వివేకానంద కూడలి (రాజ్‌విహార్ సర్కిల్), శ్రీకృష్ణ దేవరాలయ సర్కిల్ మీదుగా బుధవార పేట సాయి సీతారామంజనేయ స్వామి ఆలయం వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు లక్కిరెడ్డి అమరసింహా రెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రతాప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు మాట్లాడారు.

11న జ్యోతిబా పూలే జయంతి

కర్నూలు(అర్బన్): మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాలను ఈ నెల 11న ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి కె.ప్రసూన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు బిర్లాగేట్ సర్కిల్‌లో ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి నివాళులు అర్పించి అక్కడే జయంతి సభ నిర్వహిస్తామన్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, కుల సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పేర్కొన్నారు.

ముఖంపై తలుపులేసి.. ఏడడుగుల బంధాన్ని గెంటేసి!

సంతానం కలుగలేదని కర్కశత్వం

- నిత్యం భర్త, అతని తల్లిదండ్రుల వేధింపులు
- కట్నకానుకలుగా రూ.3.50 లక్షల నగదు, 5 తులాల బంగారం
- న్యాయం కోసం మెట్టినింటి మెట్లపై ఎల్ఎల్‌బీ విద్యార్థిని
- పోలీసుస్టేషన్‌కు చేరిన పంచాయితీ

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయుడు సొంత భార్యనే వీధిన నిలిపాడు.
పిల్లలు కలుగలేదనే సాకుతో ఆమెను వదిలించుకునేందుకు సిద్ధమయ్యాడు.
ఏడడుగులు నడిచి.. ఏడేళ్ల సంసారం చేసినప్పటికీ ఓ ఆడపిల్లకు అన్యాయం చేస్తూ ముఖంపైనే తలుపులు వేశాడు.
కట్నకానుకలు ఇచ్చినా.. భర్త మాటకు కట్టుబడి ప్రయివేటు ఉద్యోగం మానుకున్నా.. సంసారం చేసేది లేదంటూ తెగేసి చెప్పాడు.
పుట్టింట్లో ఉండలేక.. మెట్టినింట్లో అడుగు పెట్టలేక ఎల్ఎల్‌బీ చదువుతున్న ఈమె 'న్యాయం' కోసం నిరీక్షిస్తోంది.



భర్త ఇంటి ముందు బైఠాయించిన రమాదేవిని విచారిస్తున్న కానిస్టేబుల్

కర్నూలు: కర్నూలు శివారు జోహరాపురం దారిలోని లక్ష్మీ గార్డెన్ కాలనీలో నివాసముంటున్న మధుగోపాల్ సంతానం కలుగలేదని భార్య రమాదేవిని ఇంటి నుంచి గెంటేశాడు. ఇందిరాగాంధీ నగర్‌లో నివాసముంటున్న తెలుగు మన్యం, నాగలక్ష్మి దంపతులకు ముగ్గురు కొడుకులు, కూతురు సంతానం. రెండవ సంతానమైన రమాదేవికి మధుగోపాల్‌తో 2018 మార్చి 30న వివాహమైంది. కట్నకానుకలుగా రూ.3.50 లక్షల నగదు, 5 తులాల బంగారాన్ని ఇచ్చారు. రమాదేవి ఓ ప్రయివేట్ సంస్థలో టెలికాలర్‌గా పనిచేస్తుండగా.. మధుగోపాల్ ఓ ప్రయివేట్ హైస్కూల్‌లో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్నాడు. వీరి సంసారం కొంతకాలం అన్యోన్యంగా సాగినా సంతానం కలుగలేదన్న సాకుతో భర్త, తల్లిదండ్రులు వేధించడం మొదలుపెట్టారు. మూడేళ్లుగా భార్యాభర్తలు సంతానం కోసం వైద్యపరీక్షలు చేయించుకుని మందులు కూడా వాడుతున్నారు. ఇందుకోసం సుమారు రూ.3 లక్షల దాకా ఖర్చు పెట్టుకున్నారు. వైద్యుల సూచన మేరకు రమాదేవి టెలికాలర్ ఉద్యోగాన్ని మానేసి రెండేళ్లుగా ఇంటి వద్దే ఉంటూ ఎల్ఎల్‌బీ చదువుతున్నారు. అయితే సంతానం కలుగలేదన్న కారణంతో కొంతకాలంగా భార్యాభర్తల మధ్య వివాదం చెలరేగి కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఆమె కొంతకాలంగా పుట్టింట్లో ఉంటోంది. తల్లిదండ్రులు నచ్చజెప్పడంతో బుధవారం రమాదేవి భర్త ఇంటికి చేరుకుంది. అయితే అతను తాను సంసారం చేయనంటూ బయటకు గెంటేసి తలుపులు మూసుకున్నాడు. దీంతో 3 గంటల పాటు ఆమె ఇంటి ముందే బైఠాయించింది. మూడో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆమెను స్టేషన్‌ను తరలించి విచారిస్తున్నారు.

క్లుప్తంగా

పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

- త్రుటిలో తప్పిన ప్రమాదం



హాలహర్వి: మండల కేంద్రం సమీపంలో ఆదోని నుంచి బళ్లారికి వెళ్లే ప్రైవేట్ బస్సు బుధవారం అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయే క్రమంలో బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి నిలిచిపోయింది. కొంతమంది ప్రయాణికులకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

డ్రస్ కోసం ఆర్డర్ ఇస్తే ఖాతాలోని డబ్బు స్వాహా

కర్నూలు: సైబర్ నేరగాళ్లు రోజుకోరకంగా బ్యాంకు ఖాతాదారులను బురిడీ కొట్టిస్తున్నారు. కర్నూలు వాసవీ నగర్‌కు చెందిన సరిత ఆన్‌లైన్‌లో డ్రస్ ఆర్డర్ ఇచ్చి డబ్బులు చెల్లించేందుకు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయగా మొదట రూ.2,919 ఆమె ఖాతాలో నుంచి జమ అయింది. కొద్దిసేపు తర్వాత రెండో విడత రూ.81,781 ఖాతాలో నుంచి ట్రాన్స్‌ఫర్ (బదిలీ) అయినట్లు మెసేజ్ రావడంతో ఆమె అవాక్కయింది. సైబర్ నేరగాళ్లే తన ఖాతా నుంచి డబ్బు స్వాహా చేసినట్లు నిర్ధారించుకుని పోలీసులను ఆశ్రయించారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిమ్మాపురంలో చోరీ



దుస్తులను చిందరవందర చేసిన దృశ్యం

మహానంది: ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన బి.భక్తేశ్వరెడ్డి(భక్తుడు) ఇంట్లో చోరీ జరిగింది. భక్తేశ్వరెడ్డి దంపతులు గత నెల 30న ఉగాది పర్వదినం సందర్భంగా అనంతపురానికి వెళ్లారు. బుధవారం సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకోగా ప్రధాన ద్వారం తలుపు బోల్ట్ ఊడిన విషయం గుర్తించి లోపలకు వెళ్లి చూడగా బీరువాతో పాటు లాకర్లను పగలగొట్టడాన్ని గుర్తించారు. బీరువాలోని రూ.రెండు లక్షల నగదు, విలువైన బంగారు ఆభరణాలతోపాటు మరికొన్ని వెండి వస్తువులు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని ఇంటిని పరిసరాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి



సురేంద్ర(ఫైల్)

తుగ్గలి: విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. పత్తికొండ మండలం పందికోనకు చెందిన సురేంద్ర(33) విద్యుత్ పనుల నిమిత్తం కూలీ పనులకు వెళ్లాడు. తుగ్గలి మండలంలోని దిగువచింతల కొండ వద్ద ఓ రైతు పొలంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండగా సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌కు స్తంభం తాకడంతో షాక్‌కు గురయ్యాడు. తోటి కూలీలు వెంటనే పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి ఘటనా స్థలానికి వెళ్లి మృతికి కారణాలపై ఆరా తీశారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ఉజ్వల భవితకు పాలిటెక్నిక్

- 15 వరకు పాలిసెట్ దరఖాస్తుకు గడువు
- పదో తరగతి విద్యార్థులకు అవకాశం
- ఇంటర్ ఒకేషనల్ విద్యార్హతతో ద్వితీయ ఏడాదిలో నేరుగా ప్రవేశం
- 30న ప్రవేశ పరీక్ష



నంద్యాల ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

నంద్యాల(న్యూటౌన్): పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. బీటెక్ పూర్తి చేసివారి కంటే ఉద్యోగాల ఎంపికలో ప్రాధాన్యత ఉంది. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ సెక్టార్‌లోనూ పాలిటెక్నిక్ వారికే పెద్దపీట వేస్తున్నారు. ఇప్పటికే పాలిసెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 30న రాత పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 3 ప్రభుత్వ, 2 ప్రైవేట్ కాలేజీలు ఉన్నాయి. అందులో నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీశైలం పాలిటెక్నిక్ కళాశాల, బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు నంద్యాల ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్, బనగానపల్లె వాసవీ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ, సీఎంఈ, బీఎం , సీహెచ్ఎస్‌టీ, సీసీపీ, డిప్లమా ఇన్ కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయి. సివిల్ ఇంజినీరింగ్ 3 ఏళ్ల డిప్లమా కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్లలో ఉద్యోగావకాశాలున్నాయి. అలాగే వీరు బీటెక్ సివిల్ ఇంజినీరింగ్, సివిల్ ఎన్విరాన్‌మెంట్ కోర్సులు చేయొచ్చు.

30న ప్రవేశ పరీక్ష

పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30న నంద్యాల జిల్లా కేంద్రంలో పాలిసెట్ నిర్వహించనున్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400 ఫీజు చెల్లించి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీపీఓఎల్‌వైసీఈటీ.ఏపీ.ఎస్ఐసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కాగా పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నుంచి ఉచిత శిక్షణ ప్రారంభించారు. మెటీరియల్ కూడా అందించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిక్షణ ఉంటుంది.

ప్రవేశం ఇలా..

ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్హతతో ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా పాలిటెక్నిక్‌లో చేరొచ్చు. ఇంటర్ ఒకేషనల్ చేసిన విద్యార్థులు కౌన్సెలింగ్‌లో ద్వితీయ ఏడాది పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులో ప్రవేశం పొందవచ్చు. ఐటీఐ ట్రేడ్లలో 60 శాతానికి పైగా మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు బ్రిడ్జి కోర్సు ద్వారా నిర్వహించే అర్హత పరీక్షకు హాజరవ్వాల్సి ఉంది. ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ద్వితీయ ఏడాది పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులో అడ్మిషన్ పొందవచ్చు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, ఇదివరకే పదో తరగతి పూర్తి చేసిన వారు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ప్రవేశం నాటికి పదో తరగతి సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది.

చక్కటి ఉపాధి



డిప్లమా కోర్సులతో చక్కటి ఉపాధి లభిస్తుంది. వివిధ సంస్థలు డిప్లమా పూర్తి చేసిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నాయి. జీవితంలో త్వరగా స్థిరపడడానికి పాలిటెక్నిక్ సరైన మార్గం. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇదో మంచి అవకాశం, డిప్లమా కోర్సులు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగం, ఉపాధి పొందవచ్చు.

– శ్రీనివాసప్రసాద్, నంద్యాల పాలిసెట్ కన్వీనర్, నంద్యాల

నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

- ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి



స్కూల్‌లో కూరగాయలను పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

మంత్రాలయం: పిల్లలకు వడ్డించే భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మంత్రాలయం, మాధవరం జిల్లా ఉన్నత పాఠశాలలు, రచ్చుమర్రి మోడల్ స్కూల్, చిలకలడోణ పాఠశాలలోని తనిఖీలు చేపట్టారు. మాధవరం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లను సందర్శించారు. మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెనూ ప్రకారం వంట చేయకపోవడంతో వంట ఏజెన్సీపై త్రిసభ్య కమిటీకి ఫిర్యాదు చేశారు. రచ్చుమర్రి ఆదర్శ పాఠశాలలో భోజనాన్ని పరిశీలించి గడువు ముగిసిన రాగి పిండి, బెల్లం ఎలా వినియోగిస్తారంటూ ఏజెన్సీ నిర్వాహకులను నిలదీశారు. చిలకలడోణ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి వంటశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అదే గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. మాధవరం అంగన్‌వాడీ సెంటర్‌లో రికార్డులు సక్రమంగా లేకపోవడంతో కార్యకర్త తులసి, సూపర్ వైజర్ నాగలక్ష్మి, మాధవరం పాఠశాలలో విద్యార్థులకు కోడిగుడ్లు సరఫరా చేయకపోవడంతో హెచ్ఎం, బాధిత ఉపాధ్యాయుడికి మెమోలు జారీ చేశారు. అంతకు ముందు రాఘవేంద్ర స్వామిని, గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. ఆయన వెంట జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ రాజారఘువీర్, పీడీ నిర్మల, డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి, సీడీపీఓ నరసమ్మ, తహసీల్దార్ రవి, ఎస్ఐ విజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ ఉన్నారు.

త్వరలో ట్రెజరీ ఉద్యోగుల సంఘానికి ఎన్నికలు



మాట్లాడుతున్న శోభన్‌బాబు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘానికి త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నామని ట్రెజరీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శోభన్‌బాబు తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన కర్నూలుకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ట్రెజరీలో ఏర్పాటు చేసిన సమావేశంలో శోభన్‌బాబు మాట్లాడుతూ ఏకాభిప్రాయంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని సూచించారు. రాష్ట్ర సంఘం ద్వారా ట్రెజరీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించామని, అర్హులైన వారందరికి పదోన్నతులు లభించే విధంగా కృషి చేశామని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేసినందున రాష్ట్రంలో ఇపుడున్న సంఘానికి మరోసారి అవకాశం కల్పించాలన్నారు. ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి మాట్లాడుతూ పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రెజరీ ఉద్యోగుల సంఘం నాయకులు కరుణాకర్, రఘునందన్, మురళీధర్‌నాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో క్షుద్ర పూజల కలకలం



కుందూనది ఒడ్డున ముగ్గుతో మనిషి ఆకారంలో బొమ్మ వేసి పూజలు చేసిన దృశ్యం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో కుందూనది ఒడ్డున క్షుద్రపూజలు కలకలం రేపుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు చేసిన మంత్ర, తంత్ర పూజల ఆనవాళ్లు బుధవారం బయటపడ్డాయి. ముగ్గుతో మనిషి ఆకారాన్ని వేసి అందులో నిమ్మకాయలు, పసుపు, కుంకుమతో పూజలు చేసి నల్లకోడిని బలి ఇచ్చి, కోడి తలను హారతిపళ్లెంలో పెట్టి పూజలు చేసినట్లు తెలుస్తోంది. క్షుద్రపూజలు జరిగిన ప్రదేశానికి కొంత దూరంలో రెండు శతాబ్దాల క్రితం కనుమలపాడు గ్రామం ఉండేది. కుందూనది వరదల కారణంగా గ్రామం కనుమరుగైనా ఇప్పటికీ ఆ ప్రాంతంలో గ్రామానికి సంబంధించి కొన్ని ఆనవాళ్లున్నాయి. పురాతన గ్రామంలో గుప్తనిధులు ఏవైనా ఉండవచ్చనే ఉద్దేశంతో దుండగులు పూజలు చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలు వెల్లడి కావాల్సి ఉంది.

మహిళల ఆర్థికాభివృద్ధిలో బ్యాంకులే కీలకం

- డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రమణారెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వైవీ రమణారెడ్డి, చిత్రంలో ఎల్‌డీఎం రామచంద్రరావు

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంలో బ్యాంకులు అత్యంత కీలకమని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వైవీ రమణారెడ్డి తెలిపారు. బుధవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో బ్యాంకర్లు, ఏపీఎంలు, ఏసీలు, డీపీఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మాట్లాడారు. పొదుపు సంఘాలకు రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు మరింత చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకు లింకేజీ, ఫైనాన్సియల్ ఇంక్లూజన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎల్‌డీఎం రామచంద్రరావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడుతున్నాయన్నారు. రుణాల పంపిణీలో బ్యాంకులు, సెర్ప్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అదనపు పీడీ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

డ్రగ్స్ అధికారుల సోదాలు

గోస్పాడు: మెడికల్ షాపుల్లో అక్రమంగా మందుల వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో స్థానిక డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దాదాఖలందర్, జీజీహెచ్ ఫార్మసిస్టు లక్ష్మీనారాయణ, ఈగల్ టీం ఆధ్వర్యంలో బుధవారం సోదాలు నిర్వహించారు. నంద్యాలలోని నూనెపల్లెలో వైష్ణవి మెడికల్ షాప్‌లో మత్తుమందులు విక్రయిస్తూ యజమాని శ్రీనివాసరావు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికినట్లు డ్రగ్స్ అధికారులు తెలిపారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయాలు చేయడంతో పాటు నిద్ర మాత్రలు విక్రయిస్తూ పట్టుబడటంతో రూ.50 వేల విలువచేసే మందులను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోదాల్లో వీఆర్‌ఓ సల్మాన్, సిబ్బంది రమాకాంత్, కానిస్టేబుల్ రషీద్ పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు మరో 31 కిట్లు

కర్నూలు(అర్బన్): ఆధార్ నమోదుకు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు 134 కిట్లు ఉన్నాయని, తాజాగా మరో 31 కిట్లను ప్రభుత్వం సరఫరా చేసిందని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో 0–6 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న చిన్నారుల ఆధార్ నమోదును వేగవంతం చేయాలన్నారు. కొత్తగా వచ్చిన కిట్లను అవసరం అధికంగా ఉన్న మండలాలకు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే 5–7, 15–17 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారి బయోమెట్రిక్ అప్‌డేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ఐదు కోర్సుల్లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువతీ, యువకులకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఏక కాలంలో ఐదు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పక్ తెలిపారు. టైలరింగ్, జర్దోషి మగ్గం–కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, బ్యూటీపార్లర్, ఫొటోగ్రఫీ–వీడియోగ్రఫీ, కంప్యూటర్ టాలీ కోర్సుల్లో నిరుద్యోగ యువతీ, యువకులకు 30–38 రోజుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు చదవడం, రాయడం వచ్చి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు కర్నూలు శివారులోని బి.తాండ్రపాడులోని కెనరాబ్యాంకు–గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (డీఆర్‌డీఏ–టీటీడీసీ ప్రక్కన)ను సంప్రదించవచ్చన్నారు. వివరాలకు 9000710508, 63044 91236, 94409 05477 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

ఎన్ఆర్‌జీఎస్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ సస్పెన్షన్

బనగానపల్లె రూరల్: ఉపాధి కార్యాలయంలో మండల ఇంజినీరింగ్ కన్సల్టెంట్ (ఈసీ)గా విధులు నిర్వహిస్తూ ఇటీవల జూపాడుబంగ్లాకు బదిలీ అయిన మక్బుల్‌ను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ గురువారం తెలిపారు. మక్బుల్ మరో ప్రైవేట్ జాబ్ చేస్తూ ఈసీ విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండడంతో పాటు పనులపై పర్యవేక్షణ లోపించడం తదితర కారణాలతో జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఈనెల 8న ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌లో ముగిసిన పదోన్నతి శిక్షణ

కర్నూలు: కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఆర్ఎస్ఐ పదోన్నతి కోసం నిర్వహించిన రెండు వారాల శిక్షణ కార్యక్రమం ముగిసింది. కాకినాడ, విజయనగరం, మంగళగిరి, వెంకటగిరి, కడప, అనంతపురం, కర్నూలు బెటాలియన్స్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుమారు 96 మందికి ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్‌లో శిక్షణ ఇచ్చారు. పరేడ్, వైవా, ప్లటూన్ డ్రిల్, ఆయుధ వినియోగం డ్రిల్ తదితర అంశాలపై తరగతుల బోధనతో పాటు పరీక్షలు నిర్వహించారు.

లైంగిక వేధింపుల ఘటనపై ఆర్డీఓ విచారణ

కోడుమూరు రూరల్: పొలం ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు వీఆర్వోలు డబ్బు తీసుకుని తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ తహసీల్దార్ కార్యాలయంలో ఫినాయిల్ తాగి ఆత్మహత్యా యత్నానికి యత్నించిన మహిళ ఘటనపై కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ విచారణ చేపట్టారు. బుధవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని బాధితురాలితో మాట్లాడారు. పొలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు వీఆర్వోలకు డబ్బులిచ్చినట్లు గాని, లైంగిక వేధింపులకు పాల్పడినట్లుగానీ ఏమైనా ఆధారాలున్నాయా అని ఆరా తీశారు. అనంతరం నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఆయన విలేకరులకు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ ఉన్నారు.

ఆధిపత్యం కోసమే హత్యాయత్నం

- ఇద్దరు నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న జిల్లా ఎస్పీ

ఆళ్లగడ్డ: శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామంలో ఇటీవల జరిగిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇందూరు ప్రతాపరెడ్డి హత్యాయత్నం ఘటనలో ఇద్దరు ప్రధాన నిందితుల (ఏ1, ఏ2)ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను బుధవారం ఆళ్లగడ్డ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా విలేకరులకు వెల్లడించారు. శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన ఇందూరు ప్రతాపరెడ్డి సోదరుడు ఇందూరు ప్రభాకర్‌రెడ్డి, బావ శ్రీనివాసరెడ్డి 2017లో హత్యకు గురయ్యారు. ఈ కేసులో గంగదాసరి వెంకట రవిచంద్రారెడ్డి ప్రధాన నిందితుడు కాగా ప్రధాన సాక్షి ఇందూరు ప్రతాపరెడ్డి. కేసు కోర్టులో ట్రైల్‌కు రావడంతో ప్రతాపరెడ్డిని హత్య చేస్తే సాక్ష్యం లేకుండా పోవడంతో పాటు, గ్రామంలో ఆధిపత్యం చెలాయించవచ్చని భావించిన రవిచంద్రారెడ్డి, సంజామల మండలం పేరుసోముల గ్రామం సంధ్యపోగుల పక్కీరయ్య, ఉరఫ్ పక్కీర్, ఉరఫ్ సంజీవరెడ్డి, ఉరఫ్ ప్రతాప్‌లు ప్రతాపరెడ్డి గ్రామంలోని ఆలయంలో పూజ చేసేందుకు వస్తాడని తెలుసుకుని ఈనెల 5న కాపుకాశారు. ప్రతాపరెడ్డి రాగానే వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన ప్రతాపరెడ్డి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులిద్దరినీ అరెస్ట్ చేశారు. కాగా వీరికి మరో ముగ్గురు సహకరించినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, శిరివెళ్ల సీఐ వంశీధర్, ఎస్ఐ చిన్నపీరయ్య ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వెంకటేశ్వర్లు మృతదేహం

డోన్ రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లోని నాలుగో నెంబర్ ప్లాట్‌ఫారం వద్ద బుధవారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. రైల్వే ఎస్ఐ బిందుమాధవి తెలిపిన వివరాలు.. ఉదయం 8 గంటల సమయంలో ప్లాట్‌ఫారం వద్ద ఓ వ్యక్తి విగతజీవిగా పడి ఉన్నాడని సమాచారం అందడంతో రైల్వే ఎస్ఐ అక్కడికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుని వద్ద ఉన్న సెల్ ఫోన్, ఆధార్‌కార్డు ఆధారంగా స్థానిక పోచా ప్రభాకర్‌రెడ్డి కాలనీకి చెందిన తూర్పాటి వెంకటేశ్వర్లు(44)గా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు. మృతునికి భార్య హుసేనమ్మ, కూతురు, ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామన్నారు.

పిడుగుల కాలం... అప్రమత్తంగా ఉందాం..!

- విపత్తుల నిర్వహణ అథారిటీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అనుపమ సూచనలు



కర్నూలు(అగ్రికల్చర్): రానున్న రోజుల్లో ఉరుములు, మెరుపుల వర్షంతోపాటు పిడుగులు పడే ప్రమాదాలున్నాయి. ఇటీవల ఒక్కరోజులోనే జిల్లాలో మూడు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. వేసవిలో కురిసే అకాల వర్షాల సమయంలో పిడుగుల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. పిడుగు పాటు వంటి ప్రమాదాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను విపత్తుల నిర్వహణ అథారిటీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అనుపమ వివరించారు.

- ఉరుముల శబ్దం వినగానే పొలాల్లో పని చేస్తున్న రైతులు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్నవారు, పశువుల కాపర్లు, గొర్రెల పెంపకందారులు సురక్షిత ప్రాంతాల్లోకి వెళ్లాలి. లేదా రబ్బరు చెప్పులు ధరించి చెవులు మూసుకుని మోకాళ్ల కూర్చోవాలి.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నపుడు మీ మెడ వెనుక జుట్టు నిక్కబొడిచినా, చర్మం జలదరింపునకు గురైనా మెరుపు పిడుగు రావడానికి సూచనగా భావించాలి.
- ఇంట్లో ఉన్నట్లయితే కిటికీలు, తలుపులు మూసివేయాలి. ఉరుముల శబ్దం ఆగిపోయిన తర్వాత కూడా 30 నిముషాల వరకు ఇంట్లోనే ఉండాలి.
- కారు, ఇతర వాహనాల్లో ఉంటే అన్ని డోర్లు మూసివేయాలి.
- పిడుగుపాటుకు గురైన బాధితుడిని సత్వరమే దగ్గర్లోని ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.
- ఉరుములు, మెరుపులు సంభవించినప్పుడు చెట్ల కింద, చెట్ల సమీపంలో, టవర్లు, చెరువుల వద్ద ఉండకూడదు.
- బహిరంగ ప్రదేశాల్లో ఉన్న షెడ్లు, ఇంటిపై ఇతర చిన్న నిర్మాణాలలో ఉండకూడదు.
- ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర పరికరాలు, చార్జ్‌డ్ ఫోన్లు/మొబైల్స్ వినియోగించరాదు.
- పిడుగుల సమయంలో స్నానం చేయడం, చేతులను కడగటం, నీటిలో ఉండటం లాంటివి చేయరాదు.
- మోటార్ సైకిళ్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు వేలాడుతున్న విద్యుత్ తీగలకు, ఇతర ఇనుప వస్తువులకు దూరంగా ఉండాలి.

నిధులు నిర్లక్ష్యంపాలు

- తలుపులు లేక నిరుపయోగంగా విలేజ్ క్లినిక్



విలేజ్ క్లినిక్‌లో గుట్టలుగా పడిఉన్న పాతదుస్తులు

ప్యాపిలి పట్టణంలోని నాలుగో సచివాలయం పక్కనే నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌కు తలుపులు లేక పోవడంతో వృథాగా మారింది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.20.80 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మించారు. భవన నిర్మాణం పూర్తయినప్పటికీ తలుపులు బిగించేలోపు ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా భవనానికి తలుపులు ఏర్పాటు చేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మందుబాబులు, ఆకతాయిల అసాంఘిక చర్యలకు అడ్డాగా మారింది. అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ వృద్ధుడు కూడా ఇదే భవనంలో తలదాచుకుంటున్నాడు. లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనానికి కేవలం రూ.2 వేలు పెట్టి తలుపులు ఏర్పాటు చేయించడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ప్రజలకు భవనం వినియోగంలోకి రావడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనానికి తలుపులు ఏర్పాటు చేయించాలని, మరింత ఆలస్యం చేస్తే ఖర్చు చేసిన నిధులు బూడిదలో పోసిన పన్నీరు కాక తప్పదని ప్రజలు చర్చించుకుంటున్నారు. – ప్యాపిలి